## స్టేటస్‌కో ఉన్న స్థలంలో ప్రహరీ కూల్చివేత తగదు

శంషాబాద్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం ప్రహరీ గోడ వివాదం కోర్టులో స్టే ఉన్నా హైడ్రా అధికారులు కూల్చివేయడం సమంజసం కాదని దేవాలయం కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడారు.. శిశుమందిర్ స్కూల్‌కు ఆలయానికి సంబంధించిన వివాదం గతంలోనే పరిష్కరించుకున్నామన్నారు. హైడ్రా అధికారులు వివాదానికి సంబంధించిన అంశం పరిశీలించకుండా..కోర్టులో కేసు ఉన్నా కూల్చివేయడం సరైన చర్య కాదన్నారు. కోర్టు ధిక్కరణ చేపట్టిన దానిపై తాము కోర్టును మరోసారి ఆశ్రయిస్తామన్నారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షుడు నంద కిశోర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శేఖర్‌గుప్తా మాట్లాడారు.

## స్వచ్ఛ డివిజన్‌గా మార్చడమే లక్ష్యం

మైలార్‌దేవ్‌పల్లి: మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా స్వచ్ఛభారత్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ శ్రీకారం చుట్టడం వల్లే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో సేవాపక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను స్వచ్ఛ డివిజన్‌గా మార్చడానికి కృషిచేస్తానని అన్నారు.

## భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులు



అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వరదనీటిని తోడేస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హైదర్షాకోట్ సమీపంలోని హిమగిరి ర్యాలీ అపార్ట్‌మెంట్‌లోకి వరద నీరు వచ్చిచేరింది. వర్షపు నీరు చేరి ముంపునకు గురవుతున్న ప్రాంతాలను కమిషనర్ శరత్‌చంద్ర అధికారులతో కలిసి గురువారం ఉదయం పరిశీలించారు. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వచ్చిన వరద నీటిని తోడించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు అవగాహన



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డీసీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల భద్రత, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అప్లికేషన్ నమోదు, ఆహార భద్రత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, డీపీఓ స్వాతి, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ప్రత్యేక అధికారి సమీక్ష సమావేశం..

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి శ్రీధర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో పలు అంశాలపై అధికారులు, మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమలో కమిషనర్ శరత్‌చంద్ర, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ యాదయ్య, టీపీఎస్ రాకేష్, రెవెన్యూ ఆఫీసర్ శివకుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో బీజేపీదే హవా




కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణ బీజేపీదే హవా అని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. బుధవారం నగరానికి వచ్చిన ఆయనను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రికి శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణలో భారీ వర్షాలకు రైతులు ఆర్థికంగా పూర్తిగా నష్టపోయారని..నష్టపోయిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందన్నారు.

# ట్రాఫిక్ జాం.. నిత్యం నరకం

మణికొండ: ఉదయం ఇంటి నుంచి కార్యాలయాలకు వెళ్లాలన్నా..సాయంత్రం కార్యాలయాల నుంచి ఇంటికి రావాలన్నా గంటలకొద్దీ సమయంపడుతోంది. మణికొండ మున్సిపాలిటీలో ట్రాఫిక్‌లో గడపాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు ఇరుకుగా ఉండటం, వెడల్పు పనులు చేపట్టక పోవటం, వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్, వినాయకనగర్ కాలనీ, మణికొండ ప్రభుత్వ పాఠశాల చౌరస్తా, లాలమ్మగార్డన్ సెక్రటేరియట్ కాలనీ చౌరస్తా, మణికొండ మర్రిచెట్టు-ఓయూ కాలనీ రోడ్డు, అంజలిగార్డన్ కాలనీ, ఔటర్ నుంచి బీఆర్‌సీకి వచ్చే రోడ్లలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం అవుతోంది.



ఔటర్ నుంచి బీఆర్‌సీకి వచ్చే రోడ్డులో..

### పట్టించుకోని పోలీసులు..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజు ట్రాఫిక్ జాం అవుతున్నా.. ఎక్కడా ట్రాఫిక్ పోలీసులు కనిపించటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళ మాత్రమే అప్పుడపుడు విధుల్లో ఉంటున్నా.. సాయంత్రం మాత్రం ఎక్కడా కనిపించటం లేదని వారు తెలిపారు. కనిపిస్తే చాలాన్‌లు వేయటం, డ్రంక్, డ్రైవ్ తనిఖీలపు మాత్రమే ఉంటున్నాయని, రోజు వారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తమ బాధ్యత కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ఇదే విషయాన్ని ఇటీవల గండిపేటకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చినా ఎలాంటి కదలిక లేక పోవటం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



వినాయకనగర్ కాలనీలో..

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని బూరుగుకుంట కబ్జాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. కుంట పరిధిలోని ఎఫ్‌టీఎల్‌లో ఉన్న కట్టడాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతలు చేపట్టారు. మల్లన్నగుడి సమీపంలోని బూరుగు కుంటలోని ఎఫ్‌టీఎల్‌లో రాకేష్ అనే వ్యక్తి నిర్మాణం చేపట్టిన కోల్డ్‌స్టోరేజ్ గోదామును హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. సుమారు 1500 గజాల ఎఫ్‌టీఎల్ స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి అక్రమార్కులు స్థానికంగా కొందరి అండదండలతో నిర్మాణాన్ని పూర్తి చేశారు.

### కందకట్ల ప్రాజెక్టులో..

బూరుగు కుంటను ఆనుకుని మరో వైపు చేపట్టిన కందకట్ల ప్రాజెక్టు వెంచర్‌లో కూడా భారీ ఎత్తున ఎఫ్‌టీఎల్ భూమిని ఆక్రమించుకుని నిర్మాణం పూర్తి చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకును కూడా నేలమట్టం చేశారు. కుంటను ఆనుకుని మరోవైపు ఉన్న కొలను ఫ్యామిలీ వెంచర్‌లో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ప్రహరీని మొత్తం పూర్తిగా కూల్చివేశారు. హైడ్రా సీఐ తిరుమలేష్‌గౌడ్, ఇరిగేషన్ మౌనిక కూల్చివేతలను పర్యవేక్షించారు.



బూరుగు కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలోని హైడ్రా కూల్చివేసిన గోదాము

## మాజీ కౌన్సిలర్ రిమాండ్

మణికొండ: వెంకటేశ్వర కాలనీలో ఓ వ్యక్తిపై దాడి చేసి అతను గాయాలపాలయ్యేలా చేసిన మాజీ కౌన్సిలర్‌ను నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మణికొండ మున్సిపాలిటీ, వెంకటేశ్వర కాలనీలో ఐదు రోజుల క్రితం కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ బి. పద్మారావు అదే కాలనీకి చెందిన రాజ్‌కుమార్‌పై దాడి చేశారు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఉపేంద్రనాథ్‌రెడ్డి, పద్మారావు, షేక్ ఆరీఫ్ ఖాన్, బి. బాబ్జి, విశ్వనాథ్, కోటేశ్వర్‌లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాడిలో మరింత మందికి ప్రమేయం ఉన్నట్టు తేల్చటంతో పాటు మాజీ కౌన్సిలర్ పద్మారావు, కోటేశ్వర్ రావు, దేవ్‌సింగ్, అతీఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసును మరింత విచారణ చేయాల్సి ఉందని, దాడిలో ప్రమేయం ఉన్న వారిని, పాల్గొన్న వారిని గుర్తించి వారినీ అరెస్టు చేస్తామని తెలిపారు.

## హత్యకు గురైన మహిళ గుర్తింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద హత్యకు గురైన మహిళను మల్లేపల్లి ప్రాంతానికి చెందిన రేష్మా బేగంగా గుర్తించామని ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపారు. రేష్మా బేగం ప్రస్తుతం భర్త మహమూద్‌తో కలిసి ఉంటుందని ఆయన వెల్లడించారు. వీరికి ఇద్దరు సంతామని తెలిపారు. హత్యకు గల కారణాలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్దకు ఎవరి వెంబడి వచ్చింది.. ఎవరు హత్య చేశారన్న దానిపై విచారిస్తున్నామన్నారు.

## ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌గా సీతయ్య

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సీతయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆదిరెడ్డి దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో 2004 బ్యాచ్‌కు చెందిన సీతయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఫలక్‌నుమా ట్రాఫిక్, ఛత్రినాక పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## బీజేపీ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత

గోల్కొండ: బీజేపీ ఆదేశాల మేరకు ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షోత్సవం నిర్వహిస్తున్నామని గుడిమల్కాపూర్ డివిజన్ సేవా పక్షం కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన సుభాష్‌చంద్రబోస్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా పక్ష గోల్కొండ జిల్లా కన్వీనర్ వెంకటేష్, కో కన్వీనర్ మధుసూదన్, మనీష్, బోడి అన్ను యాదవ్ పాల్గొన్నారు.

### బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా ముందుకొచ్చి తమ సేవాభావాన్ని చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బీజేపీ తలపెట్టిన సేవా పక్వాడా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ..ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆర్భాటాలకు పోకుండా బీజేపీ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవరశ్రీనివాస్, అశోక్ కుమార్‌యాదవ్, అన్ను యాదవ్, నామ యాదగిరి, జె.మధుసూదన్, లక్ష్మీకాంత్ యాదవ్ ఉన్నారు.

# విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి

బండ్లగూడ: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే క్రమశిక్షణతో పాటు సంస్కారం, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్యను శిశుమందిరాల్లో బోధిస్తున్నారని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ సరస్వతి విద్యాపీఠంలో గణిత, సంస్కృతి విజ్ఞాన మేళ కార్యాక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులు తయారుచేసిన వివిధ వైజ్ఞానిక నమూనాలు ఆకట్టుకున్నాయి. చదువుతోనే ఏదైనా సాధించగలమని, విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి మన దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాలి. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు చామర్తి ఉమామహేశ్వరరావు, దక్షిణ మధ్య ప్రశిక్షణ ప్రముఖ్ రావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు

# ప్రధాని జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

రాజేంద్రనగర్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. గురువారం బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పర్‌పల్లి పీఆర్ ప్యాలెస్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 75 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. నాయకులు శ్రీధర్, మల్లారెడ్డి, సత్యనారాయణ, బాలిరెడ్డి, బాబురావు, సోల్జర్ రెడ్డి పాల్గొన్నారు.

# వరదను పరిశీలించిన హైడ్రా కమిషనర్



నీరు నిల్చి ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఓల్డ్ ముంబాయి హైవేపై వరద నీరు నిలిచిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం రాత్రి పరిశీలించారు. గత ఆదివారం, బుధవారం భారీగా కురిసిన వర్షాలకు చెరువులు నిండిపోవడంతో నీరంతా రోడ్డు మీదకు వచ్చిందని అధికారులు వివరించారు.

☛ హెచ్‌సీయూ ఎదురుగా రోడ్డు దాటేందుకు అవకాశం లేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వెళ్ళే మార్గంలో భారీగా వరద నీరు నిలిచిపోయింది. అక్కడ భూగర్భంలో ఉన్న పైపులు పూడుకుపోయి బ్లాక్ అవ్వడంతో ఇబ్బంది ఏర్పడిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. రోబోటిక్ యంత్రాలను వెంటనే తెప్పించి పైపులు క్లియర్ చేయాలని సూచించారు. లేని పక్షంలో రహదారిని తవ్వి నీటిని ఎదుటివైపు రోడ్డు దాటించాలన్నారు. అయితే యుద్ధప్రాతిపదికను పనులు పూర్తి చేసి రహదారి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అప్పటి వరకు ఎప్పటి నీరు అప్పుడు నిరంతరంగా ఇంజన్లతో తోడించాలన్నారు. రహదారిపై నీరు నిలవకుండా తాత్కాలిక ఉపశమన చర్యలు కొనసాగించాలన్నారు ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చూడాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. హైడ్రా ఆర్ఎఫ్ఓ జయప్రకాశ్, ఎస్ఎఫ్ఓ సతీష్ అక్కడి పరిస్థితిని కమిషనర్‌కు వివరించారు.

మాదాపూర్: నీటి మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. మాదాపూర్‌లోని అమర్ సొసైటీ, దుర్గం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గం చెరువులో నీటి మట్టం తగ్గించాలని, నీటిమట్టం పెరగడంతో ఎగువన ఉన్న అమర్ సొసైటీ, అనేక కాలనీలకు వరదనీరు పోటెత్తుతోందని అన్నారు. చెరువు నీటిమట్టం తగ్గిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లౌడ్ బరస్ట్‌తో అనూహ్యంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్లకుపైగా వర్షం పడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఆ పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

# మీరు చదువుకోండి.. సమస్యలు నేను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ''మీరు బాగా చదువుకుని కళాశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురండి.. కళాశాలలో ఉన్న సమస్యల పరిష్కారం నాకు వదిలేయండి '' అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డేతో పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ...2022లో శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరుతారా..? లేదా ..? సంశయం ఉండేది అలాంటి ప్రస్తుతం 500 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల లోని చిన్న చిన్న సమస్యలను వెంటనే వెంటనే పరిష్కరించుకోవడంతో పాటు ముఖ్యమైన వాటి కోసం ప్రభుత్వం వద్ద నివేదించి పనులు చేయించుకుందామన్నారు. కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారని ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రకాష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా



వినాయకనగర్‌లో పర్యటిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ తెలిపారు. గురువారం బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ రామ్మోహన్, రాజేంద్రనగర్ డివిజన్ డీఈపీ రత్నాకర్‌రావులతో కలిసి డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో పర్యటించి సమస్యలను పరిష్కరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ..విద్యుత్ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం చేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.

# బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలి

రాజేంద్రనగర్: ప్రజల సౌకార్యార్థం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చింతల్‌మెట్, సులేమాన్‌నగర్‌లలో ఎక్కువ శాతం నిరుపేదలే జీవిస్తున్నారని తెలిపారు. వారి సౌకర్యార్థం స్థానికంగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంపి రియాజ్ పాల్గొన్నారు.



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

# అసోసియేషన్‌ల ముసుగులో రాజకీయాలు



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: కాలనీ అసోసియేషన్లు, సిటిజన్ కౌన్సిల్‌లు రాజకీయాలు చేయాలని చూస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కె. సతీష్ పేర్కొన్నారు. గురువారం పుప్పాలగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాలు చేసే నాయకులు ఒక పార్టీలో ఉండాలని..ఇలా ముసుగులు వేసుకుని చేయరాదన్నారు. వెంకటేశ్వర కాలనీ సంఘం సమావేశంలో జరిగిన గొడవకు తమ పార్టీకి సంబంధం లేక పోయినా పలు మార్లు ఆరోపించటంతో పాటు ఏకంగా మున్సిపల్ మాజీ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్ పేరు ప్రస్తావించి పోలీస్‌కమీషనర్‌కు ఫిర్యాదు చేయటం, పత్రికల్లో ఆరోపణలు చేయటంతో వారి దిగజారుడు రాజకీయాలు ప్రజలకు అర్థమవుతున్నాయన్నారు. మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, మాజీ సర్పంచ్ యాలాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కింగ్స్ కాలనీలో దొంగల బీభత్సం

47 తులాల బంగారు నగలు, రూ. 11 వేల నగదు, 6 రిస్ట్ వాచీల అపహరణ

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో దొంగల హల్‌చల్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుబాయ్‌లో ఉంటున్న నూరుద్దీన్ శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని కింగ్స్ కాలనీలో ఇంటిని నిర్మించుకొని పర్యవేక్షణకు వాచ్‌మెన్‌ను నియమించుకున్నాడు. అతను ప్రతి రోజు ఇంటి పైన నిద్రించేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లో శబ్దం వినిపించడంతో కిందికి వచ్చి చూడగా వెనుక వైపున ఉన్న డోర్ తెరిచి ఉన్నట్లు గుర్తించి యజమాని బంధువుకు సమాచారం అందించాడు. వారు వచ్చి చూడగా ఇంట్లో దొంగలు పడి చోరీకి పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. 47 తులాల బంగారు ఆభరణాలు ,రూ.11వేల నగదు, 6 రిస్టు వాచీలు చోరీకి గురైనట్లు యజమానికి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు క్రైమ్ డీఐ తెలిపారు.



చోరీ జరిగిన ఇల్లు



బీరువాను పగులగొట్టిన దొంగలు

# ఫ్లీచ్ ఇండియా–ఎఫ్‌డీడీఐ మధ్య ఒప్పందం



రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సు, ప్రదర్శనపై ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఫ్లీచ్ ఇండియాతో ఎఫ్‌డీడీఐ అధికార బృందం కలిసి అవగాహన చేసుకున్నారు. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం ఒప్పందం కుదిరింది. ఒప్పంద అంగీకార పత్రాలపై ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ తేజస్విని యార్లగడ్డ, ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి సంతకాలు చేశారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో నవంబర్ 28–30 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు, ప్రదర్శనపై చర్చించి దాన్ని విజయవంతం చేసే అంశాలపై వారిద్దరు చర్చించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

గచ్చిబౌలి: వర్షాకాలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ సూచించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ఆయన గురువారం విస్తృతంగా పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావొద్దని, ప్రతి ఒక్కరూ విధిగా స్వీయ రక్షణ చర్యలు పాటించాలని ఆయన సూచించారు. పలు అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి వరద నీరు వచ్చి చేరిందని, అంతటా మోటార్లు పెట్టి సెల్లార్ల నీటిని తొలగిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఈఈ శిరీష,డీఈ ఆనంద్, శ్రీదేవి, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.